క్లుప్తంగా

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు



రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని పలుదేవర్లపాడు, రుద్రవరం గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి, ఎస్.సూర్యప్రకాశరావు పాల్గొని, 169 మందికి వైద్య సేవలందించారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. సూపర్‌వైజర్లు పీటర్‌డానియేన్, జోస్పిన్ రాణి, భవానికుమారి, రవిచంద్ర, డీఈఓ రవితేజ, ఎంఎల్‌హెచ్‌పీలు పావని, దివ్యకీర్తి, ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశాలకు రూ.2 లక్షల మల్టీ విటమిన్ టాబ్లెట్లు



సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలకు హోల్‌సేల్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు రావిక్రింది మల్లికార్జునరావు సహకారంతో సోమవారం రూ.2 లక్షల విలువ చేసే మల్టీ విటమిన్ టాబ్లెట్లు అందజేశారు. హాస్పిటల్లో ప్రసవాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో గర్భిణులకు అవసరమైన మల్టీవిటమిన్ ట్యాబ్లెట్ల కొరతను వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ దృష్టికి వైద్యులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కొత్త రామకృష్ణ మాట్లాడుతూ తాము అడగగానే స్పందించి, సహకరించిన మల్లికార్జునరావుకు అభినందనలు తెలిపారు. సభ్యుడు సయ్యద్ ఖాజా మాట్లాడుతూ కేవలం గర్భిణులు మాత్రమే కాకుండా క్యాల్షియం లోపించిన వారందరూ ఈ టాబ్లెట్లు వాడొచ్చని తెలిపారు. టాబ్లెట్లు అందించిన మెడికల్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ వెంకట్రావు, ఆర్‌ఎంఓ డాక్టర్ శోభారాణి, పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ శరత్ బాబు, డాక్టర్ రావిక్రింది శ్రీధర్ తదితరులు ఉన్నారు.

77 శాతం ఈ-కేవైసీ పూర్తి

నకరికల్లు: ఈ-క్రాప్ నమోదు చేసిన పంటలకు ఈ-కేవైసీ 77శాతం పూర్తయిందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సోమవారం తెలిపారు. మండలంలో మొత్తం వివిధ రకాల పంటలు 14,218 ఎకరాలకు ఈ-క్రాప్ బుకింగ్ చేయగా 10,801 ఎకరాలకు ఈ-కేవైసీ పూర్తయిందన్నారు. మిగిలిన భూములకు కూడా మంగళవారం లోగా ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తికావాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా పనిచేయాలి

- మూడున్నరేళ్లలో జరిగిన మేలును గృహ సారథులు వివరించాలి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన నాయకులు

సత్తెనపల్లి: సంస్కరణలతో కూడిన విప్లవాత్మకమైన మార్పులతో పారదర్శకమైన సంక్షేమ పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులే వైఎస్సార్ సీపీ విజయానికి రథసారథులని ఆయన పేర్కొన్నారు. సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో సోమవారం మంత్రి అంబటి ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అందించని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందించారన్నారు. వీటిని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై టీడీపీ అసత్య ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టారు. 'చంద్రబాబు పాలనలో వానలుండవు.. సభలు పెడితే ప్రజల ప్రాణాలుండవు.. అయనపై కేసులు పెడితే విచారణలుండవు, మాటలకు హద్దులుండవు' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. టీడీపీ నాయకులు, పచ్చ మీడియా కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టి వచ్చే ఎన్నికల్లో జగనన్నను సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పని చేయాలని కోరారు. సీఎం జగనన్న అంటేనే ఒక నమ్మకమని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేశారని కొనియాడారు. మార్చి 18వ తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లే కార్యక్రమం కొనసాగుతుందని అందుకు అందరు సిద్ధంగా ఉండాలని చెప్పారు. శిక్షణ కార్యక్రమానికి ఫణిదం, అబ్బూరు, భీమవరం, లక్కరాజుగార్లపాడు గ్రామాల నుంచి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లిరూరల్ మండలం కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్లం విజయ భాస్కరరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, సర్పంచ్‌లు వేమవరపు బుల్లిబాబు, గొలదారి అన్నపూర్ణమ్మ, బొడ్డు వెంకటరమణ, ఎంపీటీసీలు పల్లెపోగు రాహేలమ్మ, సుందరి ఇన్నమ్మ, దామచర్ల ధనలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ చిలక జైపాల్, రాజుపాలెం మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, ముప్పాళ్ల నాయకులు ఎంజేఆర్ లింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, సిరిగిరి గోపాలరావు, మక్కెన అచ్చయ్య, పంచమర్తి అప్పారావు, బొడ్డు నాగేశ్వరరావు, కూచిపూడి సైమన్, పంచుమర్తి లక్ష్మయ్య, గోపిదేశి శివయ్య, జొన్నలగడ్డ మౌనిక, వెంకట్రావు, స్థానిక నాయకులు తదితరులున్నారు.



శిక్షణకు హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టండి

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం



కౌన్సిల్ సమావేశంలో మంత్రి అంబటి రాంబాబు, చైర్‌పర్సన్ లక్ష్మీతులసి

సత్తెనపల్లి: మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఆయన ఎక్స్ అఫిషియో హోదాలో పాల్గొని, మాట్లాడారు. వేసవిలో సక్రమంగా నీటిని అందించకపోతే మొక్కలు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి పలు సూచనలు చేశారు. అజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు 24 వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ ప్రకటించారు. దీనికి సభ్యులంతా ఆమోదం తెలిపారు.

- పట్టణంలోని 4వ వార్డులో సీసీ రోడురూ.6.60లక్షల పనికి ఆమోదం తెలిపారు.
- ఒకటవ వార్డులో సీసీ కాలువ నిర్మించేందుకు రూ.4.85 లక్షల పనికి ఆమోదం.
- 8వ వార్డ్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ. 2 లక్షల అంచనాకు దాఖలైన టెండర్ ఆమోదం.
- 8వ వార్డులో కాలువ నిర్మాణానికి రూ.3.60 లక్షలు టెండర్ ఆమోదం.
- 8వ వార్డులో కాలువ నిర్మాణానికి రూ.4.40 లక్షలు టెండరు ఆమోదం. అజెండాలోని అన్ని అంశాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు ఉన్నారు.

నేడు క్రోసూరు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

క్రోసూరు: క్రోసూరు మార్కెట్ యార్డు నూతన పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవం మంగళవారం జరుగనుంది. నూతన చైర్మన్‌గా ఈదాసాంబిరెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రమాణస్వీకారోత్సవం జరుగనుంది. ఏఎంసీ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధ్యక్షత వహించనున్నారు. ముఖ్య అతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, పౌర సరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హెని క్రిస్టినా, సహకార బ్యాంక్ చైర్మన్ లాల్‌పురం రాము పాల్గొనున్నట్లు చైర్మన్ ఈ సందర్భంగా తెలిపారు. మార్కెట్‌యార్డు నూతన పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవంలో చైర్మన్‌గా పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు గ్రామానికి చెందిన ఈదాసాంబిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా గార్లపాటి దాసు, డైరెక్టర్లు సాతులూరిరాజు(పెదకూరపాడు), మేకల శ్రీనివాసరావు(కొత్తపల్లి), బాణావత్ శ్రీరాములు నాయక్(సట్టుబడితండా), షేక్ ఫాతిమూన్(పెదకూరపాడు), తిమ్మిసెట్టి కృష్ణకుమారి(చంద్రాజుపాలెం), షేక్ గాలీబ్బీ (హసనాబాద్), శాఖమూరి రాజ్యలక్ష్మి(ఊటుకూరు), ఏకుల చిన్నకోటమ్మ(జూపూడి), పెరుమాళ్ల వెంకటనరసమ్మ(లింగాపురం), చిరుమామిళ్ల నరసింహారావు(పెదపాలెం), బొడ్డుపల్లి రాము(రామాంజనేయపురం), కూనలపద్మావతి(క్రోసూరు), ఆకుల కోటేశ్వరరావు(చిగురుపాడు)వీరితో పాటుగా ఎక్స్‌అఫిషియో సభ్యులు అనుమలు కోటిరెడ్డి(క్రోసూరు పీఏసీఎస్ అధ్యక్షుడు), మల్లా చందమామ(క్రోసూరు సర్పంచ్), వి. హనుమంతరావు(క్రోసూరు, ఏడీఏ), కె.సూర్యప్రకాశ్‌రెడ్డి(పల్నాడుజిల్లా ట్రేడ్, మార్కెటింగ్ అధికారి) ప్రమాణస్వీకారం చేస్తారు. కార్యక్రమానికి హాజర య్యే అతిథులను ఘనస్వాగతం పలుకుతూ భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. కావున వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఏఎంసీ చైర్మన్ ఈదాసాంబిరెడ్డి

కరాటేలో సత్తెనపల్లి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో రాంబాబు, మాస్టర్ రామయ్య

సత్తెనపల్లి: కరాటేలో సత్తెనపల్లికి చెందిన షీకోకాయ్ షిటోరియో కరాటే స్కూలు విద్యార్థులు 19 మంది ప్రతిభ కనబరిచారు. ఒంగోలులో ఈ నెల 26న నిర్వహించిన కరాటే ఇంటర్ స్టేట్ చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో బి.తేజశ్వని ఓపెన్ గ్రాండ్ చాంపియన్ కైవసం చేసుకుంది. అండర్ 14 బాలికల విభాగంలో జబి.తేజశ్వి(గోల్డ్), ఓపెన్‌గ్రాండ్ చాంపియన్ కైవసం చేసుకుంది. అండర్ 12 విభాగంలో బి.నైష్టవి (గోల్డ్), జి.టి.జస్విత(సిల్వర్), అండర్ 10 విభాగంలో కౌశల్య(బ్రాంజ్) కైవసం చేసుకున్నారు. వ్యక్తిగత బాలుర అండర్ 12 విభాగంలో చరణ్ (గోల్డ్), అండర్ 10 విభాగంలో కె. శివ సందీప్(గోల్డ్), అండర్ 9 విభాగంలో ఎంవీ బాలాజీ(గోల్డ్), అండర్ 11 విభాగంలో కార్తికేయ (గోల్డ్), అండర్ 12 విభాగంలో ఎ.ధనుంజయ్ (గోల్డ్), అండర్ 8 విభాగంలో ఎస్. హేమంత్ (గోల్డ్), అండర్ 10 విభాగంలో సీహెచ్.జశ్వంత్ (సిల్వర్), అండర్ 18 విభాగంలో టి.వి.కార్తీకరెడ్డి (బ్రాంజ్), అండర్ 7 విభాగంలో ఎల్.కిరీట్(బ్రాంజ్), అండర్ 9 విభాగంలో సాయిరాం మణికంఠ (బ్రాంజ్), అండర్ 13 విభాగంలో పీఏవీ సుకేత్ (బ్రాంజ్), అండర్ 11 విభాగంలో ఎల్.గేష్ట(బ్రాంజ్), అండర్ 10 విభాగంలో షణ్ముక సాయిరెడ్డి (సిల్వర్), అండర్ 14 విభాగంలో డీఎంఏ రామ బ్రాహ్మాచారి(బ్రాంజ్), అండర్ 8 విభాగంలో కార్తికేయ (బ్రాంజ్) కైవసం చేసుకున్నారు. ఘన విజయం సాధించిన కరాటే స్కూల్ విద్యార్థులను షిహాన్ అనుముల రాంబాబు, మాస్టర్ అనుముల రామయ్య అభినందించారు.

ఆశ్రమంలో అన్నసంతర్పణ

సత్తెనపల్లి: పట్టణంలోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో క్రోసూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు విప్పల వెంకట్రామిరెడ్డి కుమారుడు విప్పల ఆషిత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా.. సోమవారం అన్న సంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు విప్పల వెంకట్రామిరెడ్డి, సుమలత, రాజుపాలెం మాజీ జడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

రెండు రోజులు మంచినీటి సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పురపాలక సంఘ హెడ్ వాటర్ వర్క్‌లో పాత వాల్వ్ స్థానంలో కొత్త వాల్వ్ ఏర్పాటు చేస్తున్నందున మార్చి 1, 2వ తేదీల్లో పట్టణంలోని 11 నుంచి 24వ వార్డు అనగా వెంగళరెడ్డి నగర్, పార్క్ ఏరియా, రఘురాం నగర్, రాజుల కాలనీ, బోయ కాలనీ, వడ్డవల్లి, శాస్త్రి నగర్, మున్సిపల్ ఏరియా, కొత్తపేట, సాలిపేట, యానాది కాలనీ, నాగన్న కుంట, మెయిన్ రోడ్డులో సగం ప్రాంతంలో రక్షిత మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సోమవారం తెలిపారు. పట్టణ ప్రజలు ముందుగా తాగునీటి నిల్వ చేసుకుని, పురపాలక సంఘానికి సహకరించాలని కోరారు.

వైఎస్సార్ సీపీలోకి కొత్తపల్లి మాజీ సర్పంచ్



అచ్చంపేట: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితుడై కొత్తపల్లి మాజీ సర్పంచ్ మార్కపూడి దేవదానం తన అనుచరవర్గంతో సోమవారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. కొత్తపల్లి నుంచి అనుచరులతో గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయానికి తరలి వెళ్లారు. ఎమ్మెల్యే శంకరరావు పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పటి వరకు కొత్తపల్లి రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన దేవదానం వైఎస్సార్ సీపీలో చేరడంతో టీడీపీకి భారీ షాక్ తగిలినట్లేనని స్థానికులంటున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు నరసింహరావు, సాంబశివరావు, పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు తుమ్మా చిన్నపరెడ్డి, మేకల శ్రీనివాసరావు, సుంకర శ్రీనివాసరెడ్డి, ఉప ఎంపీపీ గంగసాని బాబు, లిడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, సచివాలయాల కన్వీనర్ రామకృష్ణ, సందెపోగు పున్నారావు తదితరులున్నారు.

ఎన్టీఆర్‌ను పొట్టన పెట్టుకున్న దుర్మార్గుడు చంద్రబాబు



మాట్లాడుతున్న కొడాలి నాని, వేదికపై మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు, ఎమ్మెల్యేలు

- సీఎం జగన్‌ను దించి రాష్ట్ర సంపదను కొల్లగొట్టేందుకు యత్నం
- జగన్‌ను ఏ భాషలో దూషిస్తే అదే భాషలో తిరిగి సమాధానం చెబుతా
- మాజీమంత్రి, గుడివాడ శాసనసభ్యుడు కొడాలి నాని

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను పొట్టన పెట్టుకున్న దుర్మార్గుడు చంద్రబాబు అని మాజీ మంత్రి, గుడివాడ శాసనసభ్యుడు కొడాలి వెంకటేశ్వరరావు(నాని) అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవంలో ఆదివారం ఆయన ప్రత్యేక అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అధ్యక్షత వహించారు. కొడాలి నాని మాట్లాడుతూ వ్యవస్థలో మార్పునకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. దానిలో భాగంగా ఒకేసారి రూ. 25 వేల కోట్లతో 45 వేల స్కూళ్ల ఆధునికీకరణ చేపట్టారన్నారు. ఒక్క విద్యా రంగానికే రూ. 65 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. పేదలు చదువుకుంటే ప్రపంచంలో ఎక్కడైనా మంచి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుని కుటుంబాలు ఉన్నత స్థితికి చేరుతాయని సీఎం జగన్ భావించారన్నారు. గతంలో చంద్రబాబు విద్యారంగానికి కేవలం రూ.5,400 కోట్లు మాత్రమే ఖర్చు చేశాడన్నారు. ఉన్నఫలంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గద్దె దించి చంద్రబాబును గద్దెక్కించి రాష్ట్ర సంపదను కొల్లగొట్టుకోవచ్చని లోకేష్, పవన్ కల్యాణ్, ఏబీఎన్ రాధాకృష్ణ, టీవీ5 బీఆర్ నాయుడు, ఈనాడు రామోజీరావులు యత్నిస్తున్నారన్నారు. కొడుకు లోకేష్ కోసం ఎన్టీఆర్‌ను చంపి పార్టీని లాకున్న 420 చంద్రబాబు అని దుయ్యబట్టారు. సీఎం జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జగన్ సీఎంగా ఉంటే పేదలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. చంద్రబాబు కరకట్ట కుక్క అని జగన్ ప్యాలెస్ పులి అనే విషయాన్ని గ్రహించాలన్నారు. 16 నెలలు జైల్లో ఉన్నా, 12 సీబీఐ కేసులు సోనియాగాంధీ, చంద్రబాబు కలిసి పెట్టినప్పటికీ లెక్క చేయలేదన్నారు. లక్ష్మీపార్వతి పార్టీని నాశనం చేస్తుందంటూ ఎన్టీఆర్ కుటుంబ సభ్యులను రెచ్చగొట్టి పార్టీని లాక్కున్నాడని, ఎన్టీఆర్ పిల్లలను తాగుబోతులు, తిరుగుబోతులుగా ప్రచారం చేసి ఇంటికి పరిమితం చేసిన దుర్మార్గుడు చంద్రబాబు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జోలికొస్తే ఆయనను ఏ భాషలో దూషిస్తున్నారో అదే భాషలో తిరిగి సమాధానం చెబుతామన్నారు. గతంలో మా కంటే ఎక్కువగా చంద్రబాబును విమర్శించిన కన్నా లక్ష్మీనారాయణ పదవుల కోసం టీడీపీలో చేరాడని, గతంలో చంద్రబాబు హయాంలో కేసులకు భయపడి కన్నా బీజేపీ పంచన చేరాడన్నారు.

రాష్ట్రంలో అవినీతిరహిత పాలన..


రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ధర్మంగా, న్యాయంగా, అవినీతి రహితంగా పరిపాలన చేస్తున్నామన్నారు. లెక్కలు వేసుకొని తాను పార్టీలో చేరలేదని, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి వెంట నడిచి, జగన్ పార్టీ పెట్టగానే ఆయన వెంట నడిచానన్నారు. సభలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాదరావు, ఎన్విరాన్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజ నారాయణ, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావులు మాట్లాడారు.

చూడకుంటే.. ఖాతా ఖాళీ

పది రోజుల్లో ఐదుగురి బ్యాంకు ఖాతాల్లో నగదు మాయం

కారెంపూడి: తరచూ బ్యాంకు ఖాతాదారులు తమ ఖాతాలోని నగదును చూసుకుంటూ ఉండండి. మీరు దాచుకున్న నగదు మొత్తం ఉండకపోవచ్చు. లేదా..పూర్తిగా ఖాళీ అవ్వొచ్చు. సైబర్ నేరగాళ్ల పనో... మరేయితర కారణాలో తెలియదు కానీ, కారెంపూడిలో గడచిన పది రోజుల్లో ఎనిమిది మంది ఖాతాదారులు తమ నగదు పోగొట్టుకుని లబోదిబోమన్నారు. వీరందరూ స్థానిక యూనియన్ బ్యాంకు ఖాతాదారులే. తమ ఖాతా నుంచి నగదు మాయం అయిన విషయం బ్యాంకుకు వచ్చే వరకు వారికి తెలియదు. నగదు డ్రా చేసేందుకు బ్యాలెన్స్ చూడగా.. ఖంగు తిన్నారు. ఒప్పిచర్లకు చెందిన ఓ రైతు నవంబరులో సదరు బ్యాంకు ఖాతాలో రూ.70 వేల నగదు దాచుకున్నాడు. ఇటీవల బ్యాంకుకు వచ్చి డ్రా చేసుకోవాలని యత్నిస్తే తన ఖాతాలో రూ.29 వేలు మాత్రమే ఉన్నాయని బ్యాంకు అధికారులు తెలపడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. తనకు తెలియకుండా నగదు మాయం కావడంతో బ్యాంకు అధికారులను నిలదీశాడు. మిగతా నలుగురి ఖాతాదారుల పరిస్థితి కూడా ఇలాంటిదే. ఇది సైబర్ నేరగాళ్ల పని అని.. అధికారులు వారికి వివరించలేక సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో తమ నగదుపై మిగతా బ్యాంకు ఖాతాదారుల్లో ఆందోళన నెలకొంది. స్థానిక యూనియన్ బ్యాంకులో ఇప్పటి వరకు ఐదు ఖాతాల నుంచి సుమారు రూ.70 వేల దాకా నగదు మాయం అయినట్లు సమాచారం. ఈ విషయమై బ్యాంకు బ్రాంచి మేనేజర్ ఎ.భాస్కరరావు వివరణిస్తూ.. సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలను హ్యాక్ చేస్తూ నగదును అపహరిస్తున్న మాట నిజమేనన్నారు. దీనికి తమ ఖాతాదారులను అప్రమత్తం చేస్తూ.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సందేశాలు పంపుతున్నామన్నారు. తమ ఆధార్ నంబరును లాక్ చేసుకోవడం ద్వారా ఈ సైబర్ దోపిడీని అడ్డుకోవచ్చని ఖాతాదారులకు సూచించారు. ఇది ఇలా.. ఉంటే ఏఈపీఎస్ ద్వారా సైబర్ నేరస్తులు తమకు లభ్యమైన ఖాతారుల ఆధార్ నంబర్, వేలి ముద్రల ఆధారంగా బ్యాంకు ఖాతాల నుంచి నగదు మాయం చేస్తున్నారని, ముఖ్యంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల వెబ్‌సైట్ల నుంచి వీటిని హ్యాక్ చేస్తున్నారని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అలాగే వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉన్న ఇతర సంస్థల నుంచి కూడా డేటా చోరీ అవుతున్నట్లు చెప్తున్నారు. దీనికి ఆధార్ నంబరును లాక్ చేసుకోవడమే ప్రస్తుతం ఉన్న మార్గమంటున్నారు. ఇక ఆధార్‌తో సెలఫోన్ నంబరు లింకు కాని నిరక్షరాస్యుల పరిస్థితి ఏమిటనేదే ఆందోళన కలిగించే విషయం.

తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలి




సత్తెనపల్లి: మండలంలోని కొమెరపూడి వీఆర్‌ఏ కొరబండి శ్రీనివాసరావుపై సత్తెనపల్లి మండల తహసీల్దార్ కె.నగేష్ దాడి చేయడం హేయమైన చర్య అని ఏపీ జేఏసీ చైర్మన్ పెండెం మణిరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఏపీ ఎన్జీఓ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మణిరావు మాట్లాడుతూ వీఆర్‌ఏ శ్రీనివాసరావుపై తహసీల్దార్ నగేష్ చేయి చేసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. మండల మేజిస్ట్రేట్ హోదా కలిగిన తహసీల్దార్ దురుసు ప్రవర్తన హేయమైన చర్య అన్నారు. ఈ దాడిని ఖండిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎస్‌ఎం సుభాని, జి.సాల్మన్ రాజ్, పొన్నం వెంకటేశ్వర్లు, చిలుకా ఆగష్టస్‌బాబు, క్రోసూరు ఏపీ ఎన్జీవోస్ ప్రెసిడెంట్ బాషా, సచివాలయ సంఘ అధ్యక్షుడు సందె పోగు శ్రీనివాసరావు, సీపీఎస్ అధ్యక్షుడు గార్లపాటి సునీల్ బాబు, సత్యనారాయణ, ఉపాధ్యాయ, కార్మిక సంఘం నాయకులు ఉన్నారు.

అందుబాటులో ఓటర్ల జాబితా

ముప్పాళ్ళ: మండలంలోని రెండు గ్రామ పంచాయతీల్లో త్వరలో జరిగే వార్డు సభ్యుల ఎన్నిక నేపథ్యంలో ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి సోమవారం తెలిపారు. మాదల గ్రామ పంచాయతీ పరిధిలో 6వ వార్డు, రుద్రవరం 7వ వార్డుకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లోని ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

సీనియర్ అసిస్టెంట్‌కు తీవ్రగాయాలు



దుర్గి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ నిర్మల ద్విచక్రవాహనం నుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడింది. సోమవారం విధులు ముగించుకొని మాచర్ల వెళ్తున్న క్రమంలో పెట్రోల్ బంకు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను హుటాహుటిన 108 వాహనంలో మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించారు.